# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 12-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.

- దేశ ప్రజలకు సులభతర జీవనాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఉద్ఘాటించారు.

- ఆంధ్రప్రదేశ్‌ను బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు.

- నైరుతి రుతుపవనాలు కోస్తాంధ్రా, ఒడిశా సహా మరికొన్ని ప్రాంతాలకు విస్తరించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

=======================

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్... చంద్రబాబు నాయుడుతో పాటు మొత్తం 24 మంది చేత రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయించారు.

(వాయిస్ 23 సెకన్లు)

ఇందులో భాగంగా తెలుగుదేశం పార్టీకి చెందిన 20 మంది, జనసేన పార్టీ నుండి ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్, భారతీయ జనతా పార్టీ నుండి సత్యకుమార్ యాదవ్ లు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు.

(వాయిస్ 23 సెకన్లు)

అదేవిధంగా ముగ్గురు మహిళా శాసన సభ్యులకు నూతన మంత్రివర్గంలో స్థానం లభించింది. కాగా... కొత్తగా ఏర్పడిన మంత్రివర్గంలో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు తదితరులు హాజరయ్యారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

2014 సంవత్సరం నుండి దేశంలో చేపట్టిన సంస్కరణలు కొనసాగుతాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఈరోజు ఆమె ఢిల్లీలో ఆర్థిక మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత 10 సంవత్సరాలుగా దేశం ... బలమైన నాయకత్వం, అభివృద్ధి ఆధారిత పరిపాలనను చూస్తోందన్నారు. ఇది వివిధ రంగాలలో పరివర్తనకు దారితీసిందని, బలమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించిందని వివరించారు. దేశ ప్రజలకు సులభతర జీవనాన్ని అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రభుత్వం 'సబ్కా సాత్, సబ్కా వికాస్, సబ్కా విశ్వాస్, సబ్కా ప్రయాస్ సూత్రాన్ని విశ్వసిస్తోందన్న కేంద్ర మంత్రి శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ కోసం పారిశ్రామిక వేత్తలు, పౌరులు, అంతా సహకరించాలని పిలుపునిచ్చారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్‌ను బాల కార్మిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఈరోజు విజయనగరంలో ఆయన అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. బాలల కోసం పనిచేస్తున్న జిల్లా స్థాయి విభాగాల అధికారులు, సిబ్బంది చేపట్టిన ఈ ర్యాలీని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... బడి వయసు బాలలు బడిలోనే ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే జరిమానాలు, శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు రానున్న 3 - 4 రోజుల్లో కోస్తాంధ్రా, ఒడిశా, వాయువ్య బంగాళాఖాతంలోని మరికొన్ని ప్రాంతాలలో ప్రవేశించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లోని కొన్ని చోట్ల తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు ఒకటి రెండు చోట్ల వీచే అవకాశం ఉందని కేంద్రం తెలియజేసింది.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ ఉదయం గన్నవరం విమానాశ్రయానికి వచ్చిన ఆయనకు చంద్రబాబు నాయుడు స్వాగతం పలికారు. ఆయనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ప్రధానమంత్రి స్వాగత కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి నుండి ఇరువురు నేతలు కలిసి, ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగిన కేసరపల్లి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. కార్యక్రమం అనంతరం ప్రధాన మంత్రి గన్నవరం విమానాశ్రయానికి చేరుకొని, అక్కడి నుండి భువనేశ్వర్‌కు ప్రయాణమయ్యారు

.= = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతనంగా ప్రవేశపెట్టిన నేర చట్టాల ద్వారా కక్షిదారులకు మేలు జరుగుతుందని తిరుపతి జిల్లాకు చెందిన న్యాయవాదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్ చట్టాలు వచ్చే నెల ఒకటవ తేదీ నుండి దేశవ్యాప్తంగా అమల్లోకి వస్తున్న నేపథ్యంలో... వీటిని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు... బ్రిటిష్ కాలం నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ రూపొందించిన ఈ మూడు నూతన చట్టాల ద్వారా ఎంతో ఉపశమనం లభిస్తుందని తిరుపతికి చెందిన న్యాయవాది జి. రమేష్ పేర్కొంటూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

నూతన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రేపు ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. ఈ రాత్రి ఆయన గన్నవరం నుండి ప్రత్యేక విమానంలో తిరుపతి, అక్కడి నుండి రోడ్డు మార్గం ద్వారా తిరుమల చేరుకుని అక్కడ బస చేస్తారు. రేపు ఉదయం తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని, తిరుగు ప్రయాణమవుతారు. రేపు సాయంత్రం అమరావతి సచివాలయంలో మొదటి బ్లాక్ లోని ఛాంబర్ లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నన్నారు. అనంతరం ఆయన మెగా డిఎస్సీపై తొలి సంతకం, భూ హక్కు చట్టాన్ని రద్దు చేస్తూ రెండవ సంతకం చేయనున్నారని, సామాజిక పింఛన్ ను 4 వేల రూపాయలకు పెంచుతూ మూడవ సంతకం చేయనున్నారని తెలుగు దేశం పార్టీ కేంద్ర కార్యాలయం తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

తూర్పు నౌకాదళ సిబ్బందికి కృత్రిమ మేధకు సంబంధించిన అప్లికేషన్స్‌పై క్యాప్సూల్ కోర్సును విశాఖపట్నం లోని GITAM డీమ్డ్ యూనివర్సిటీ రెండు రోజుల పాటు నిర్వహించింది. INS కళింగ సమన్వయంతో జరిగిన ఈ తరగతులలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ కు సంబంధించిన ప్రాథమిక భావనలను వివరించే ఇంటరాక్టివ్ సెషన్‌లు నిర్వహించినట్లు నౌకదళ అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. GITAM విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు... సెషన్‌ల నిర్వహణలో పాల్గొని నౌకాదళ సిబ్బందికి ఆచరణాత్మక నైపుణ్యాలను అందజేసినట్టు నౌకాదళ అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాలను ప్రోత్సహించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు. ఈరోజు ఆయన భీమవరం నుండి దృశ్యమాధ్యమం ద్వారా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో మాట్లాడారు. ప్రసవాలు నూరు శాతం ప్రభుత్వ ఆసుపత్రులలోనే జరగాలని, ప్రసవాలు తక్కువగా నమోదవుతున్న ఆసుపత్రులను గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారికి సూచించారు. రోగులలో రక్తహీనతను నివారించేందుకు ఐరన్ టాబ్లెట్ లు, ఇంజక్షన్లు ఇవ్వాలన్నారు. సిబ్బంది సమష్టిగా కృషి చేసి, మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టాలని కలెక్టర్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలోని వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ పూర్తి కావచ్చిందని పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు తెలిపారు. దోమల వ్యాప్తిని నివారించేందుకు గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పాఠశాలల ప్రారంభానికి ముందుగా దోమల మందు పిచికారీ చేపట్టినట్టు పేర్కొన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుతోందని వివరించారు. వసతి గృహాల పరిధిలో రోగ నిర్ధారణ పరీక్షా పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలని, హాస్టల్స్ లో చేరబోయే విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = =